క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు నగరంలోని పలు కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మార్గాని భరత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించి పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 50వ వార్డు ఇన్‌చార్జి గుత్తుల మురళీధర్, ముప్పన ప్రభాకర్, ముప్పన శ్రీనివాస్, బిల్డర్ చిన్నా తదితరులు పాల్గొన్నారు.

నర్సరీని సందర్శించిన తెలంగాణ ఎమ్మెల్యే



ఉమా పార్వతి నర్సరీలో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

కడియం: బుర్రిలంకలోని ఉమా పార్వతి నర్సరీని తెలంగాణలోని వరంగల్ జిల్లా నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి బ్రదర్స్ శివాజీ, మూర్తి సృష్టించిన టాల్ బోన్సాయ్ నర్సరీలో వందేళ్ల వయసున్న వృక్ష జాతి మొక్కల గురించి తెలుసుకున్నారు. ఆ మొక్కల వల్ల కలిగే ప్రయోజనాలు, పెంపకం గురించి కూడా మూర్తి వివరించారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ దేశానికి, పర్యావరణానికి కడియం నర్సరీ రైతుల చేస్తున్న సేవలు చాలా విలువైనవన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా కడియం నర్సరీల ద్వారా లక్షల మంది ఉపాధి పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో ముత్యం జగదీష్, అలంపల్లి శ్రీను, స్థానిక నర్సరీ రైతులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్ల పంపిణీ



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎస్‌కేవీటీ కళాశాల సిబ్బంది

సీటీఆర్ఐ: స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీవ కారుణ్య సమాజంలో వృద్ధులకు పండ్లు, రొట్టెలు, మజ్జిగ పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రమణ మూర్తి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి మానవతా వాదంతో ముందుకు నడవాలని కోరారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్ డి.నీలిమ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గొడుగుల వితరణ



వృద్ధులకు గొడుగులు పంపిణీ చేస్తున్న గుబ్బల రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ: వృద్ధులను అందరూ ఆదరించి, గౌరవించాలని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ వ్యవస్థాపకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు అన్నారు. లాలాచెరువులోని ఆశ్రమ ప్రాంగణంలో గురువారం వృద్ధులకు గొడుగులు, పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. రాంబాబు మాట్లాడుతూ కుటుంబ సభ్యుల నిరాదరణతో వృద్ధులు ఆశ్రమాల వైపు చూస్తున్నారన్నారు. వారి చివరి మజిలీని గౌరవంగా సాగనంపేందుకు స్వర్ణాంధ్ర సేవా సంస్థ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో స్వర్ణాంధ్ర మేనేజర్ హరికృష్ణ, దివ్య, మీరా కుమారి, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ



వేమగిరిలో కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

రాజమహేంద్రవరం రూరల్: ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆదేశాల మేరకు గురువారం జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు ఈ చర్యలు తీసుకున్నారు. ముఖ్యమైన ట్రాఫిక్ కూడళ్ల వద్ద వాహనాలను తనిఖీ చేశారు.

మేమంతా సంసిద్ధం..

- అప్రమత్తతతోనే యుద్ధ విపత్తు నుంచి రక్షణ
- ఆకట్టుకున్న మాక్ డ్రిల్
- సీపీఆర్ చేసే విధానంపై అవగాహన
- పరిశీలించిన జాయింట్ కలెక్టర్, అదనపు ఎస్పీ



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న ఫైర్ సిబ్బంది

సీటీఆర్ఐ: పాకిస్థాన్‌తో నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో వైమానిక దాడులు జరిగితే రక్షించుకునే విధానంపై ప్రజలకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. స్వీయరక్షణతో పాటు ఇతర సహాయక చర్యలను వివరిస్తున్నారు. దాడులను ఎదుర్కొనేందుకు తామంతా సంసిద్ధంగా ఉన్నామని, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు. దీనిలో భాగంగా స్థానిక ఆర్ట్స్ కళాశాల వద్ద గురువారం సాయంత్రం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఒక పక్క సైరన్ల మోత, మరో పక్క పోలీసులు, ఫైరింగ్, ప్రమాదంలో చిక్కుకున్న క్షతగాత్రులు, తాత్కాలిక ఆరోగ్య కేంద్రాలకు తరలింపు, ప్రాథమిక చికిత్స, సీపీఆర్ ద్వారా ప్రాణాపాయ స్థితి నుంచి రక్షణ, తీసుకోవాల్సిన చర్యలను ప్రజలకు అవగాహన కల్పించారు.

వివిధ ప్రదేశాలలో మాక్ డ్రిల్

రాజమహేంద్రవరం రూరల్: ఉగ్రవాద దాడులు జరిగితే అత్యవసర సమయంలో పౌరులు స్వీయ రక్షణ చర్యలు తీసుకోవడం, వాటిని ఎలా ఎదుర్కోవాలనే అనే అంశాలపై విమానాశ్రయం, రైల్వే స్టేషన్లు, బస్టాండ్ల వద్ద అధికారులు మాక్ డ్రిల్ నిర్వహించారు. స్పెషల్ పార్టీ పోలీసులు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ఫైర్, హెల్త్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు మాట్లాడుతూ ప్రజల భద్రత, అప్రమత్తత పరిస్థితుల్లో వారు ఎలా స్పందించాలో అవగాహన కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశమన్నారు. అలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానాస్పదంగా ఏమైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలన్నారు.

ప్రమాదంలో చిక్కుకుంటే..

యుద్ధ సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, స్వీయరక్షణ ఎలా పొందాలి, ఇతరులను ఎలా రక్షించాలనే అంశాలపై అగ్ని మాపక, పోలీసు, వైద్య,ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. వివిధ రకాల సైరన్లకు ఎలా స్పందించాలో ప్రజలకు వివరించారు.

ప్రజలకు అవగాహన...

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాలకు అనుగుణంగా నగరంలోని అన్ని వార్డు సచివాలయాల పరిధిలో దశల వారీగా మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉంటూ అనుకోని రీతిలో జరిగే ప్రమాదాలు, ఉగ్రదాడుల్ని దీటుగా ఎదుర్కోవాలని అధికారులు సూచించారు. ఈ మేరకు ప్రభుత్వ యంత్రాంగాన్ని సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, అదనపు ఎస్పీ డి.సుబ్బరాజు, ఆర్డీవో ఆర్.కృష్ణ నాయక్, జిల్లా అగ్నిమాపక అధికారి మార్టిన్ లూథర్ కింగ్, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, సీపీవో ఎల్.అప్పలకొండ పాల్గొన్నారు.



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు



బాధితుడిని ఆస్పత్రికి తీసుకువెళుతూ..



క్షతగాత్రులను తరలించే విధానంపై అవగాహన



ఇనుప ఊచలను కట్ చేసే పద్ధతిని వివరిస్తున్న అధికారులు

అభివృద్ధి పనుల వేగం పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో అభివృద్ధి పనుల వేగం పెంచాలని కమిషనర్ కేతన్ గార్గ్ సూచించారు. ఈ మేరకు గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంజినీరింగ్ విభాగ అధికారులతో సమీక్షించారు. నగర పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, వాటి ప్రగతిపై డివిజన్ల వారీగా ఆరా తీశారు. పుష్కరాల నేపథ్యంలో రానున్న రెండేళ్లు ఎంతో కీలకమని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఇంజినీరింగ్ ఎస్ఈ కోటేశ్వరరావు, ఈఈలు మదర్సా అలీ, మాధవీ, రీటా, డీఈలు, ఏఈలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

డీఎం క్రిటికల్ కేర్ వైద్య సేవలు ప్రారంభం



డీఎం క్రిటికల్ సేవల ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

కంబాలచెరువు: అత్యవసర సమయంలో రోగిని ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి తీసుకువస్తే 80 శాతంపైగా ప్రాణాలను నిలబెట్టే అవకాశం ఉంటుందని సురక్ష ఎమర్జెనీ వైద్యుడు ప్రశాంత్ నేదునూరి అన్నారు. దానవాయిపేటలోని సురక్ష ఎమర్జెన్సీ ఆసుపత్రిలో డీఎం క్రిటికల్ వైద్య సేవలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి విచ్చేసిన రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ప్రాణాపాయంలో రోగికి వైద్యం అన్ని ఆసుపత్రుల్లోను అందిస్తారని, అయితే సురక్షలో ప్రత్యేకంగా డీఎం క్రిటికల్ కేర్ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి రావడం ఆనందదాయకమన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పేదలకు నాణ్యమైన వైద్య సేవలందించే దిశగా ముందుకు సాగాలన్నారు. సీసీసీ ఎండీ పంతం కొండలరావు మాట్లాడుతూ డీఎం క్రిటికల్ కేర్ అంటే రోగి చివరి స్థాయిలో ఉన్నా ప్రాణం కాపాడే ప్రక్రియ అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆదిరెడ్డి అప్పారావు, డాక్టర్ గురుప్రసాద్, డాక్టర్ ఏ.నాగేశ్వరరావు, సీపీఎస్ శాస్త్రి, డాక్టర్ భాస్కర్ చౌదరి, డాక్టర్ బొమ్మిరెడ్డి శ్రీనివాస్, ప్రసాదుల హరినాథ్, గొర్రెల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రివర్ సిటీస్ అలయన్స్‌తో నగరాభివృద్ధి



పుష్కర ఘాట్‌ను పరిశీలిస్తున్న బృంద సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: రివర్ సిటీస్ అలయన్స్ కార్యక్రమంతో రాజమహేంద్రవరం ముఖచిత్రమే మారిపోనుందని కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. ఆయన సూచనల మేరకు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్ బృందం గురువారం నగరంలో పర్యటించింది. రివర్ సిటీస్ అలయన్స్ అనేది నదీ తీరంలోని నగరాలను అభివృద్ధి చేసే బృహత్తర కార్యక్రమమని కమిషనర్ తెలిపారు. దీనిని నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగా, నేషన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 2021 నవంబర్ 25న అప్పటి కేంద్ర జల్ శక్తి మంత్రి చేతుల మీదుగా ప్రారంభమైన ఈ కార్యక్రమంలో 146 నగరాలకు సభ్యత్వం ఉందన్నారు. నగర పాలక, రెవెన్యూ, అటవీ, టూరిజం, రుడా అధికారులతో కలిసి రెండు రోజుల పాటు ఈ బృందం నగరంలో పర్యటించి 15కి పైగా నదీ సంబంధిత ముఖ్య ప్రాంతాలను పరిశీలించినట్లు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

రాజమహేంద్రవరం రూరల్: అప్పుల బాధ తాళలేక లలితానగర్‌కు చెందిన కోలా శ్రీనివాసరావు (60) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. కోలా శ్రీనివాసరావు టి.నగర్‌లో నెల్లూరు మెస్ నిర్వహిస్తున్నాడు. గత రెండేళ్లుగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారుజామున మెస్‌లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు టూటౌన్ ఎస్సై శ్యామ్‌సుందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: చెట్ల కొమ్మల కత్తిరింపు, లైన్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు.

- ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ దుర్గానగర్, మల్లయ్యపేట పెట్రోల్ బంక్ రోడ్, ఊటలంక, లూథర్‌గిరి కాలేజీ ఏరియా, శ్రీరామ్ నగర్, వివేక్ బిర్యానీ ఏరియా, పేపర్ మిల్లు సాయిబాబా టెంపుల్ ఏరియా, హర్ష కుమార్ ఏరియా, బ్రదరన్ చర్చి ఏరియా, గిరిజన కార్పొరేషన్ ఏరియా, చెరుకూరి వారి ఏరియా, విద్య నగర్, వీవర్ కాలనీ, రావిచెట్టు, చర్చి ఆఫ్ గాడ్ , గణేష్ నగర్, పోస్టాఫీస్ రోడ్ ఏరియా, మసీద్ స్ట్రీట్, పంచాయతీ వీధి, కొత్తపేట, వెంకటగిరి కొండ, జిల్లా స్టోర్స్, బొమ్మూరు సెంటర్ నుంచి రాజవోలు రోడ్డు వరకూ, సుద్దకొండ, నేతాజీనగర్ అన్ని వీధులు, బొమ్మూరు చెరువు సెంటర్ నుంచి బాలాజీపేట జంక్షన్ వరకూ, ఏసీబీ కాలనీ, రాఘవేంద్రనగర్ కాలనీ, గురుకులం ఏరియా, సెయింటాన్స్ స్కూల్ ప్రాంతాల్లో సరఫరా ఉండదు.
- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు అన్నపూర్ణమ్మపేట, జాంపేట, అశోకా థియేటర్ పరిసర ప్రాంతం, గణేశ్ చౌక్, మదన్ సింగ్ పేట, జాంపేట పోలీస్ స్టేషన్ పరిధి, లక్ష్మీవారపుపేట ప్రాంతాల్లో విద్యుత్ ఉండదు.
- ఉదయం 8 నుంచి పది గంటల వరకూ ఏవీ అప్పారావు రోడ్డు, విద్యుత్ కాలనీ, బర్మా కాలనీ, వెంకటేశ్వరనగర్, మహాలక్ష్మి టెంపుల్ స్ట్రీట్, శారద నగర్, గ్రౌండ్ వాటర్ కాలనీ, సత్యనారాయణపురం, వీఎల్ పురం సెంటర్, తెలుకులవారి చెరువు ఏరియా, చక్రధర హాస్పిటల్ ఏరియా, రిలయన్స్ బంక్ ఏరియా, అన్నమయ్య వీధుల్లో విద్యుత్ నిలిపివేస్తారు.

గంజాయి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

రాజమహేంద్రవరం రూరల్: గంజాయి కేసులో పట్టుబడిన నిందితుడికి పదేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధిస్తూ జిల్లా ఎన్‌డీపీఎస్ కమ్ ఒకటవ అదనపు సెషన్స్ జడ్జి ఆర్.శివకుమార్ గురువారం తీర్పుచెప్పారు. వివరాల్లోకి వెళితే.. 2017 నవంబర్ 21న 266 కేజీల గంజాయిని నర్సీపట్నం నుంచి వరంగల్‌కు లారీలో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. మొదటి నిందితుడైన విశాఖ జిల్లా మాకవరపాలెం మండలం తామరం గ్రామానికి చెందిన దల్లి కామిరెడ్డిని అప్పటి బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ కె.నాగమోహన్‌రెడ్డి అరెస్టు చేసి కోర్టు ఉత్తర్వులు మేరకు రిమాండ్‌కు తరలించారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో పై విధంగా తీర్పు చెప్పారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున పీపీ లక్ష్మణ్ నాయక్ బలమైన వాదనలు వినిపించారు. అప్పటి దర్యాప్తు అధికారి కె.నాగమోహన్‌రెడ్డి, ప్రస్తుత బొమ్మూరు పీఎస్ ఇన్‌స్పెక్టర్ పి.కాశీవిశ్వనాథం పర్యవేక్షణలో కోర్ట్ హెడ్ కానిస్టేబుల్ పి.విశ్వేశ్వరరావు సాక్షులను సరైన సమయంలో ప్రవేశపెట్టి శిక్ష పడటానికి దోహదపడ్డారు.ఈ కేసులో రెండో నిందితుడైన విశాఖపట్నం జిల్లా గొలుగొండ మండలం లింగంపేటకు చెందిన బొద్దిన సురేష్‌కు ఈ నెల 2వ తేదీన న్యాయమూర్తి ఆర్.శివకుమార్ పదేళ్ల జైలుశిక్ష, రూ.లక్ష జరిమానా విధించిన విషయం తెలిసిందే.

ముగింపు సభలను జయప్రదం చేయాలి



ముగింపు సభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

రంగంపేట: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 12వ తేదీన జరిగే అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య 50 వసంతాల ముగింపు సభలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రమేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం సింగంపల్లి గ్రామంలోని సీపీ రెడ్డి నగర్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 1974లో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ సారథ్యంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఏర్పడిందన్నారు. కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసమే కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసులపై యుద్ధం ప్రకటించి, ఎన్‌కౌంటర్ల పేరుతో హత్యలు చేస్తోందని విమర్శించారు. వెంటనే కగార్‌ను నిలిపివేసి మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎన్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు, పీడీఎస్‌యూ(వి) రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్ పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయం

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. ఆ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం వరల్డ్ రెడ్ క్రాస్ డే, ఇంటర్నేషనల్ తలసేమియా డే సందర్భంగా కోటిపల్లి బస్టాండ్ వద్ద గల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు రక్తదానంపై అవగాహన ర్యాలీ జరిపారు. తొలుత జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి ఆధ్వర్యంలో హెన్రీ డునాంట్ చిత్రపటానికి పూలమాల వేశారు. ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ర్యాలీలో పాల్గొని అనంతరం రక్త దానం చేశారు. తొలుత జాయింట్ కమిషనర్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా అనేక చోట్ల రెడ్ క్రాస్‌డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్‌వీఎస్‌ఎస్ మూర్తి, ఆర్డీవో ఆర్.కృష్ణ నాయక్, అర్బన్ తహసీల్దార్ పాపారావు, రెడ్ క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.



రెడ్ క్రాస్ సొసైటీ భవన్‌లో రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న జేసీ చిన్నరాముడు



హెన్రీ డూనాంట్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్వో సీతారామమూర్తి

రాజమహేంద్రవరం రూరల్: అవసరంలో ఉన్న ప్రజలకు రక్షణను హామీ ఇచ్చే శక్తివంతమైన సంస్థ రెడ్ క్రాస్ అని జీపీఆర్ జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎం.నరసింహారెడ్డి అన్నారు. అంతర్జాతీయ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముందుగా రెడ్ క్రాస్ సంస్థ వ్యవస్థాపకుడు హెన్రీ డూనాంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. రెడ్ క్రాస్ సంస్థ కౌన్సిలర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ మానవత్వాన్ని సజీవంగా ఉంచడానికి రెడ్ క్రాస్ సంస్థ కృషి చేస్తోందన్నారు. తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ స్వామి మాట్లాడుతూ మంచి భావాలను విద్యార్థుల్లో పెంపొందింప చేయడానికి పాఠశాలల్లో రెడ్ క్రాస్ సంస్థ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం 20 మంది హెచ్ఐవీ బాధిత చిన్నారులకు రూ.550 విలువైన పౌష్టికాహారాన్ని పాఠశాల ఉపాధ్యాయుల సహకారంతో అందించారు.. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ పితాని సత్యనారాయణ రాజు, పల్లెడ పైడి నాయుడు, హెచ్ఐవి కౌన్సిలర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీలక్ష్మి అన్నారు. ఆమె గురువారం జిల్లా న్యాయసేవాధికార సంస్థలో వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సీనియర్ సిటిజన్ల హక్కులపై ఆయా ప్రభుత్వ సంస్థల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లకు పథకాలపై అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఎలాంటి న్యాయ సమస్యలున్నా పారా లీగల్ వలంటీర్ల ద్వారా తమ సంస్థకు తెలియజేయాలన్నారు.

మానవ హక్కులపై సదస్సు



మానవ హక్కుల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరులోని ఎంవీఎస్ ఫంక్షన్ హాల్లో గురువారం మానవ హక్కులపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ క్రైమ్ అసోసియేషన్ ఢిల్లీ నేషనల్ చైర్మన్, హైకోర్టు అడ్వకేట్ బోడా రాకేష్ నాయక్ మాట్లాడుతూ మానవ హక్కులను చట్ట పరంగా ఎలా సాధించుకోవాలో తెలిపారు. ఈ సదస్సులో వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా ప్రెసిడెంట్ విజయసారథిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా, పీజీ కన్‌స్ట్రక్షన్స్ అధినేత దాడి నాగేశ్వరరావును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రెసిడెంట్‌గా, నేషనల్ చైర్మన్‌గా బోడ రాకేష్ నాయక్‌ను నియమించారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు.

11వ రోజుకు చేరిన సీహెచ్‌వోల సమ్మె



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సీహెచ్‌వోలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని కలెక్టరేట్ వద్ద ఏపీ మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌పీ)/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపీఎంసీఏ) ఆధ్వర్యంలో చేపట్టిన సీహెచ్‌వోల నిరవధిక సమ్మె గురువారానికి 11వ రోజుకు చేరుకుంది. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మమత మాట్లాడుతూ ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న సీహెచ్‌వోలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

సినిమాలు



శ్యామల : శుభం
సూర్యమినీ : సారంగపాణి జాతకం, బ్లైండ్ స్పాట్
సూర్యప్యాలెస్ : తుడరుమ్
స్వామి : హిట్–3
శివజ్యోతి : హిట్–3
అనుశ్రీ : జింఖానా
రాజా : హిట్–3
ఊర్వశి : జగదేకవీరుడు అతిలోకసుందరి
మేనక : అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి
రంభ : 6 జర్నీ, కామన్ మ్యాన్ పెళ్లాం
కుమారి : కలియుగం 2064
అప్సర : సింగిల్
అశోక : రెట్రో
నామవరం
వీఎస్ మహల్ : హిట్–3
ధవళేశ్వరం
మురళీకృష్ణ : సింగిల్
కడియం
వెంకటసూర్య : హిట్–3